క్లుప్తంగా

ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ఆహ్వానం

రాయచోటి : రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఆదివారం జరిగే ఇఫ్తార్ విందుకు హాజరుకావాలని ముస్లింలను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆహ్వానించారు. శనివారం సాయంత్రం పట్టణంలోని బంగ్లా, ఠాణాల వద్ద ఉన్న మసీదులకు శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి నమాజ్ ప్రార్థనలలో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందుకు తప్పక హాజరుకావాలని అందరినీ ఆహ్వానించారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్‌రెహమాన్, మదనపల్లె పార్టీ పరిశీలకుడు హబీబ్‌ఖాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, గౌస్‌ఖాన్, అన్నాసలీం, మూసా ఉన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన డీఈఓ


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న డీఈఓ పురుషోత్తం

చిన్నమండెం : పదో తరగతి పరీక్షలు జరుగుతున్న మండల కేంద్రంలోని జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని శనివారం జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం పరిశీలించారు. అనంతరం చిన్నమండెం బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం శుభ్రంగా లేదని సిబ్బందిని మందలించారు. అలాగే హెచ్‌ఎం జయచంద్ర విధుల్లో లేకపోవడంపై ఆరా తీశారు.

చీరలు పంపిణీ


గాలివీడు:చీరలు పంపిణీ చేస్తున్న ఉపసర్పంచ్ మన్నూర్

గాలివీడు: బోరెడ్డిగారిపల్లి పంచాయతీలో పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని ఉపసర్పంచ్ మన్నూర్ బోరెడ్డిగారిపల్లి, గొందిపల్లి, సుగాలితాండా, బక్కిరెడ్డిగారిపల్లెలలో చీరలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ మహమ్మద్ రఫీ, ముజాహిద్, లాల్ బాషా, జమీల్ సలీం, ఆరీఫ్, యాకుబ్, వలి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లెకు చెందిన బీసీ నాయకుడు విజయభాస్కర్ సోదరుడు రాజేంద్రప్రసాద్ సతీమణి మణెమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఎంపీటీసీ రాజేంద్ర, ఉప సర్పంచ్ రాజారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షాజహాన్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ

పుల్లంపేట: పుల్లంపేటలోని ఆదర్శ పాఠశాలను శనివారం మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జూన్ నెలలో విద్యార్థులకు అందించే జగనన్న కిట్లను జాగ్రత్తగా భద్రపరచాలని ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం సీఆర్‌పీలు, ప్రిన్సిపాల్స్, ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ రంగనాథయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న పంజం సుకుమార్ రెడ్డి

ఓబులవారిపల్లె: రైతు భరోసా కేంద్రాలలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు పంజం సుకుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మంగంపేట రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసి పంటలు సాగుచేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ, వ్యవసాయ అధికారి శ్రీరాములు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నందలూరు వెంకటసుబ్బారెడి తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని తాకట్టు పెడుతున్న బీజేపీ

రాజంపేట రూరల్: బీజేపీ ప్రభుత్వం భారత దేశాన్ని అదాని లాంటి కార్పొరేట్లకు తాకట్టు పెడుతోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, సీపీఎం ఏరియా కార్యదర్శి సి.రవి కుమార్‌లు విమర్శించారు. పట్టణంలోని హరిచంద్రనగర్‌లో ప్రచార భేరి రెండవ రోజు సందర్భంగా శనివారం సీపీఐ, సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామ కృష్ణదేవరాయలు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, నరసింహులు, అహమ్మద్ పాల్గొన్నారు.

బడుగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


రాయచోటి: ప్రభుత్వ పథకాల అమలు గురించి మహిళను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


ఓబులవారిపల్లె:జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రాయచోటి : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్ ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని 13వ సచివాలయం, 18వ వార్డు పరిధిలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లుతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలపై ఆరా తీశారు.

నాయీ బ్రాహ్మణులకు గౌరవం ఇచ్చింది జగన్ ప్రభుత్వమే

నాయీ బ్రాహ్మణులకు దేశ చరిత్రలోనే జగన్ ప్రభుత్వం అరుదైన గుర్తింపు, విలువను ఇచ్చిందని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాలలో ప్రాధాన్యత, ఆలయాలలోని క్షురకులకు కమీషన్ పెంపు వంటి చర్యలను చేపట్టిందన్నారు. 82వేల మంది బీసీలు రాజకీయ సాధికారతతో పదవులలో ఉన్నారని, బీసీల హృదయంలో జగనన్న.. జగనన్న హృదయంలో బీసీలు ఉన్నారన్నారు.

సమస్యలు పరిష్కారం

చౌడమ్మ గుడి ఎదురు వీధికి చెందిన గుర్రమ్మ తాను ఆరోగ్యశ్రీ క్రింద లబ్ధి పొందానని, జగనన్న మేలు మరువలేనని శ్రీకాంత్ రెడ్డి ఎదుట ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చౌడమ్మ వీధికి చెందిన సుబ్బమ్మ తనకు జగనన్న చేదోడు కింద ఏడాదికి వరుసగా ఆర్థిక సహాయం అందుతోందని హర్షం వ్యక్తం చేశారు. గరుడాద్రి నగర్‌లో రూ. 3 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణాలను త్వరలో చేపడతామని శ్రీకాంత్ రెడ్డి హామీ ఇచ్చారు. శేషాద్రి నగర్‌కు చెందిన కుప్పం శివయ్య తన కుమారునికి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కింద ఆర్థిక సహాయం అందడంపై కృతజ్ఞతలు తెలిపారు. బోరింగ్ వీధిలో సీసీ రోడ్డు ఏర్పాటుకు హామి ఇచ్చారు. అన్ని వీధులలో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ స్తంభాలకు ఎల్‌ఈడీ లైట్లను యుద్ధప్రాతిపదికన అమర్చాలని ఆదేశించారు.

మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, మదనపల్లె పరిశీలకుడు హబీబుల్లా ఖాన్, కౌన్సిలర్ నాగాంజలి భాస్కర్, జయన్న నాయక్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదనమోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దిన్నెపాడు రవిరాజు పాల్గొన్నారు.

గడప గడపకు మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం

రాయచోటిటౌన్ : మా నమ్మకం నీవే జగన్ అంటూ గ్రామ స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు గడపగడపకు వెళుతున్నారు. శనివారం రాయచోటి రూరల్ పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామంలో గ్రామ సర్పంచ్ పైనేని ప్రభావతమ్మ గడపగడపకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మాజీ వైస్ సర్పంచ్ తిరుపాల్ నాయుడు, ఎంపీటీసీ ఆంజనేయుల నాయుడు, కన్వీనర్లు పి. శివయ్యనాయుడు, బి. సుబ్రహ్మణ్యం, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్న నువ్వే మా భవిష్యత్తు

రామాపురం: జగనన్న నువ్వే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగనన్నా కార్యక్రమం శనివారం మండలంలోని కల్పనాయిని చెరువు గ్రామంలోని మాలపల్లె, యానాదికాలనీలో నిర్వహించారు. మాజీ సర్పంచ్ రామకృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్న పోస్టర్లను ఇంటింటికి అతికించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాబు, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, రాఘవయ్య పాల్గొన్నారు.

అప్పారాజుపేటలో..

రాజంపేట రూరల్: మండల పరిధిలోని పోలి పంచాయతీ అప్పారాజుపేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి గడప గడపకు వెళ్లి ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌లను గృహాలకు, మొబైల్ ఫోన్లకు అంటించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపారు. మార్కెట్ యార్డు చైర్మన్ పోలి సుబ్బారెడ్డి, జేఎస్‌సీ రాజంపేట రూరల్ ఇన్‌చార్జి వెలగచెర్ల గంగిరెడ్డి, సర్పంచ్ పెంచలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాపక్షపాతి సీఎం జగన్‌మోహన్ రెడ్డి

ఓబులవారిపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా పక్షపాతి అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్‌తో పాటు ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, సర్పంచ్ జయపాల్ రెడ్డిలు గడప గడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా వారికి అందుతున్న సంక్షేమ ఫలాల గురించి వివరించారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందక ప్రజలు అగచాట్లు పడ్డారని, ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ యుగం నడుస్తోందన్నారు. వైస్ ఎంపీపీ-2 కొమ్మూరు సుమిత్ర, మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు టంగుటూరు రాజశేఖర్ రెడ్డి, నరేష్ కుమార్ రెడ్డి, మైనార్టీ నాయకులు సయ్యద్ ఖాసీం, సయ్యద్ ఇస్మాయిల్, షేక్ మౌలా పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్న

గాలివీడు : మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం గోరాన్ చెరువులో పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరిగి జగనన్నను ఆశీర్వదించి మరొక్కసారి శ్రీకాంత్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాకానుక స్టాక్ పాయింట్

చిట్వేలి: చిట్వేలిలోని ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక సామగ్రిని నిల్వ ఉంచేందుకు స్టాక్ పాయింట్‌ను నిర్ణయించినట్లు జాయింట్ డైరెక్టర్ (మోడల్ స్కూల్) ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో విద్యాసామగ్రిని పంపిణీ చేసేందుకు మండల విద్యాశాఖ అధికారి అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. స్టాక్ పాయింట్ భద్రత, విద్యాసామగ్రి పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత మండల కమిటీకి అప్పగించామన్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

రాజంపేట : పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఈ నెల 17 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తీసుకోవాలనుకున్న వారు టెన్త్ హాల్‌టికెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటోతో తమ కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ శిక్షణలో మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో ప్రాథమిక అంశాలను బోధించి , ఆబ్జెక్టివ్ తరహాలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కాగా రాష్ట్ర సాంకేతికశాఖ మే 10వ తేదీన నిర్వహించే పాలిసెట్ పరీక్షకు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

రామాపురం: ప్రస్తుత వేసవిలో ఎండ తీవ్రతకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మండల తహసీల్దార్ వైఎస్ సత్యానందం పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎండ ప్రభావంతో వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయన్నారు. ఏదైనా పని ఉంటే ఉదయం 10గంటలలోపే ముగించుకోవాలని, లేదా సాయంత్రం 4 గంటల తరువాత పనులపై దృష్టి పెట్టాలన్నారు.

21 నుంచి గంగాభవాని అమ్మవారి బ్రహ్మోత్సవాలు


గంగాభవాని అమ్మవారి మూల విరాట్


ప్రత్యేక అలంకరణలో మండెం లక్ష్మీనరసింహస్వామి


ప్రత్యేక అలంకరణలో కాల గంగమ్మ తల్లి

సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ శివారులోని బంగారుపేట గ్రామ సమీపంలో వెలసిన గంగాభవాని అమ్మవారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ఫ్యామిలీ ట్రస్టు అధ్యక్షుడు మాడా పెద్దసుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 21న గణపతి పూజ, స్వస్తి వాచనము, మాతృకపూజ, ఋత్విక్ వరణము, రక్షాబంధనము, అష్టోత్తర కలశాభిషేకం, అర్చనలు, మంగళ హారతి వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహిస్తామన్నారు. 22వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 9 గంటలలోపు మహాపూర్ణాహుతి, మంత్రపుష్పం, మహదాశీర్వచనం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందన్నారు. 23వ తేదీ అమ్మవారికి బోనాలు, మొక్కుబడుల చెల్లింపు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

మండెం లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె పంచాయతీ జల్లావాండ్లపల్లెలోని మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా కాల గంగమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట సమీపంలోని సాలాబాద్ క్రాస్ రోడ్డు వద్ద చెరువు కట్టపై వెలసిన కాల గంగమ్మ తల్లి ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా ప్రారంభించారు. ఉదయం కాల గంగమ్మ తల్లికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి వేములూరు మునెయ్య బృందం వారిచే అమ్మవారి హరికథ వినిపించారు. ఆదివారం ఉదయం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు.

ఐక్యతకు ప్రతీక ఇఫ్తార్


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ, జెడ్పీ చైర్మన్ ఎమ్మెల్యేలు

రాజంపేట టౌన్ : ఇఫ్తార్ విందు ఐక్యతకు ప్రతీకవంటిదని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. రాజంపేట పట్టణంలోని వజ్రం ఫంక్షన్ హాల్‌లో శనివారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని రాజంపేట, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్‌తో కలిసి ఎంపీ ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఉండే ముస్లింలకు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందు ఇస్తుండటం అనాదిగా ఓ సాంప్రదాయంగా వస్తుండటం ఆనందదాయకమని తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి దాదాపు మూడు దశాబ్దాలుగా క్రమం తప్పకుండా రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు ఇస్తున్నారన్నారు. ముస్లింలతో ఆయనకున్న అనుబంధం ప్రత్యేకమైనదని తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అల్లాహ్ కృప వల్లే దాదాపు 30 ఏళ్ల నుంచి పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చే అవకాశం లభిస్తోందన్నారు. ఇది తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో జరుగుతున్న ఇఫ్తార్ విందులో తాము భాగస్వాములం కావడం తమ అదృష్టమని తెలిపారు. తొలుత ఎంపీ, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు, సబ్‌కలెక్టర్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు గాలివీటి విజయసాగర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన


రాయచోటి టౌన్:పైఅంతస్తులో మంటలను అదుపు చేసే పద్ధతిని ప్రదర్శిస్తున్న సిబ్బంది

రాజంపేట రూరల్ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు అగ్నిమాపకశాఖ అధికారి పచ్చిపాల శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ (పాతబస్టాండు)లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అకస్మాత్తుగా మంటలు చెలరేగినప్పుడు ఏ విధంగా చర్యలు తీసుకోవాలో, ప్రమాదాలను అరికట్టడం ఎలాగో డెమో నిర్వహించారు. ప్రమాదాల నివారణపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్‌ఎఫ్‌ఓలు బి. సత్యరాజు, బీసీఆర్ సుబ్రమణ్యం, పి.రవీంద్రబాబు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన విన్యాసాలు

రాయచోటిటౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో అగ్నిమాక శాఖ అధికారులు నిర్వహించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో మంటలను ఎలా ఆర్పాలి, ఎలా నియంత్రించాలనే విషయాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా విన్యాసాలు ప్రదర్శించారు. రాయచోటి ఫైర్ స్టేషన్ అధికారి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఇళ్లలో చెలరేగిన మంటలను ఎలా అదుపు చేయాలి, ఆ సమయంలో ఎలా ప్రవర్తించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లి : బహిరంగ ప్రదేశాలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలనే అంశంపై లక్కిరెడ్డిపల్లె అగ్నిమాపక అధికారి బాల ఉసేనయ్య అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొండూరులో డ్రోన్ సర్వే ప్రారంభం

పెనగలూరు: మండలంలోని కొండూరు పంచాయతీలో మండల వైస్ ప్రెసిడెంటు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొండూరు విజయ్ రెడ్డి శనివారం డ్రోన్ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములను డ్రోన్ ద్వారా సర్వే చేయడం ఎంతో సులభతరమన్నారు. మండల సర్వేయర్ ఓబయ్య, కొండూరు సర్పంచ్ జయమ్మ, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

భూసార పరీక్ష, మట్టి నమూనాలపై శిక్షణ

సిద్దవటం: మండలంలోని బొగ్గిడివారిపల్లె ఆర్‌బీకే పరిధిలో క్షేత్ర స్థాయి సిబ్బందికి భూసార పరీక్షపై, ప్రయోగాత్మకంగా మట్టి నమూనాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి మాట్లాడారు.

రామాపురంలో..

రామాపురం: మండలంలోని ప్రతి ఆర్‌బీకే నుంచి మట్టి నమూనా సేకరించాలని లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సంచాలకురాలు ఎం.జయరాణి అన్నారు. మట్టి పరీక్ష శిక్షణ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణ నిర్వహించారు.

తోటివారికి సాయపడటమే ఇస్లాం జీవన విధానం



రాజంపేట రూరల్: రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడా

రాజంపేట రూరల్ : తోటి వారికి సాయపడటమే ఇస్లాం జీవన విధానమని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పోలి పంచాయతీ అప్పారాజుపేటలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు షావలి ఆధ్వర్యంలో రంజాన్ తోఫా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ పోలి సుబ్బారెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని ఆశీర్వదించండి

నందలూరు(రాజంపేట) : ముస్లింల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి నాగిరెడ్డిపల్లెలోని జామియా మసీదులో జనాబ్ ఎస్టీఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇఫార్త్ విందు సభలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతికి ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. రంజాన్‌మాసంలో ఉపవాసాలు ఉంటున్న వారికి ఇఫ్తార్ విందు ఇవ్వడం మహాపుణ్యకార్యమన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్‌సభ్యుడు కలీం, జిల్లావక్ఫ్‌బోర్డు సెక్రటరీ అమీర్, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ మున్వర్‌బాషా, మాజీ ఎంపీపీ లక్ష్మీనరసయ్య, సర్పంచ్ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆకలి తీర్చిన ‘మేడా’


నిరుద్యోగులకు భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, తనయుడు కృష్ణతేజారెడ్డి

రాజంపేట : రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి రాజంపేటలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విచ్చేసిన వేలాది మంది నిరుద్యోగుల ఆకలిని తీర్చారు. వారికి భోజనాలు, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన తనయుడు మేడా కృష్ణతేజారెడ్డి స్వయంగా నిరుద్యోగులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కృష్ణారావు యాదవ్, బీసీ పార్లమెంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడు పసుపులేటి సుధాకర్, బీసీ నాయకులు వడ్డె రమణ, వడ్డె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

■ ఏఐటీఎస్ అధినేత చొప్పాగంగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ జిల్లా అధికారి హరికృష్ణ, కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఒంటిమిట్ట ఎంపీపీ గడ్డం జనార్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య, ఎస్సీసెల్ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు సత్యాల రామకృష్ణ, డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐ పుల్లయ్య, ఎస్ఐ భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు తరలి వెళ్లిన నిరుద్యోగులు

ఒంటిమిట్ట : రాజంపేటలోని ఏఐటీఎస్‌లో శనివారం జరిగిన మెగా జాబ్ మేళాకు ఒంటిమిట్ట మండలానికి చెందిన నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. స్థానిక హరితా హోటల్ నుంచి ప్రత్యేక వాహనాల్లో వారిని జాబ్‌మేళాకు పంపినట్లు ఒంటిమిట్ట ఎంపీడీఓ రెడ్డయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం నుంచి..

సిద్దవటం : రాజంపేటలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు సిద్దవటం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నుంచి పెద్ద సంఖ్యలో యువత తరలి వెళ్లారు. గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, మండల యూత్ కన్వీనర్ కృష్ణచైతన్య, రామిరెడ్డి ఓబుల్‌రెడ్డిల ఆధ్వర్యంలో వీరిని ప్రత్యేక బస్సుల్లో తరలించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పులి రామ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షయవ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు

నందలూరు(రాజంపేట): క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని ప్రాంతీయ వైద్యాధికారి సృజన తెలిపారు. నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలోని అరవపల్లె సబ్‌సెంటర్‌లో క్షయవ్యాధిపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరునెలల పాటు మందులు వాడుతూ, దాతల సహకారంతో వైద్యులు అందించిన పౌష్టికాహారం తీసుకుంటే క్షయను నయం చేసుకోవచ్చన్నారు. క్షయవ్యాధిని జయించిన టీబీ ఛాంపియన్ మాట్లాడారు. వైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, టీబీ సూపర్‌వైజరు పిల్లి జయప్రకాశ్, ఎంఎల్‌హెచ్‌పీ సులోచన, లక్షుమయ్య, ఆశా వర్కర్స్, 104 సిబ్బంది పాల్గొన్నారు.